క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

రేపు మంగరాయ సన్నిధిలో మహాకాల పూజ

ఆదోని అర్బన్: పట్టణశివారులోని శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో అమావాస్య సందర్భంగా శనివారం మహాకాల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ భీమసేనఆచారి గురువారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు దోషపరిహారార్థం కోసం ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింహ, కుంభ, మీన, మేష, ధనస్సు, తులరా శుల వారికి అర్ధాష్టమ, అష్టమ, శనిదోష పరిహారం, పితృ శాప పరిహారం కోసం మహాకాల శనిపూజ చేపడుతున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గల వారు 7799857707 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అంతర్ జిల్లాల బదిలీ ఉత్తర్వులు సవరించాలి

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయులకు మేలు కలిగేలా ఇంటర్ డిస్ట్రిక్ బదిలీల ఉత్తర్వులను సవరించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య పట్టణ కార్యదర్శులు కోటన్న, వెంకటేశ్వర నాయుడు డిమాండ్ చేశారు. ఎంటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ పంచాయితీ రాజ్ వ్యవస్థలోని ఉపాధ్యాయులకు, పురపాలక ఉపాధ్యాయులకు బదిలీల విషయం దృష్టిలో పెట్టుకొని బదిలీలను చేపట్టాలన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ బదిలీలో జీరో సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని బదిలీలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంటీఎఫ్ నాయకులు చంద్రమౌళి, బడుగు బసవరాజు, ప్రతాప్ రెడ్డి, ఎల్లాగి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత వైద్య పరీక్షలు



బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారిచే మండలంలోని ఆరేకల్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదో ని బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణమూర్తి, సెంట్రల్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ అనూష, డాక్టర్ సాయికుమార్ బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చాలామంది బాలికలకు జ్వరాలు, జలుబు, దగ్గు తదితర వ్యాధులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి పాల్గొన్నారు.

25 నుంచి యార్డులో పాసింగ్ వ్యవస్థ ఉండదు

ఆదోని అర్బన్: రైతుల కష్ట, నష్టాలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 25వ తేదీ నుంచి ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులు తెచ్చిన వేరుశనగకాయల దిగుబడులకు పాసింగ్ వ్యవస్థ ఉండదని యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కల్పన తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వేరుశనగ దిగుబడులను తీసుకొచ్చేటప్పుడు ఆరబెట్టుకుని, శుభ్ర పరుచుకుని తీసుకురావాలని సూచించారు. దీంతో ధర కూడా అధికంగా పలుకుతుందన్నారు. సోమవారం నుంచి వ్యాపారస్తులు యార్డులో పాసింగ్ వ్యవస్థ మానుకోలేకపోతే లైసెన్సులను రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకు రైతులు వేరుశనగ దిగుబడులను తడిగా ఉంటే ఆరబెట్టుకుని రాళ్లు, మట్టి ఉంటే శుభ్ర పరుచుకుని యార్డుకు విక్రయానికి తీసుకొచ్చి సహకరించాలని కోరారు. ఆమెతో పాటు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ పాల్గొన్నారు.

ఏఓగా కౌసల్య

పెద్దకడబూరు : జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కౌసల్య పదోన్నతిపై పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయానికి రెగ్యులర్ ఏఓ(అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్)గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మాగోడు ఎవరికి చెప్పుకోవాలి ?



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బోయ నరసన్న గుడేకల్ గ్రామం. పిల్లలందరికీ పెళ్లిలు కావడంతో ఎవరి కాపురాలు వారు వేరుగా పెట్టుకోవటంతో భార్యభర్తలు జీవనం సాగిస్తున్నారు. 5 సంవత్సరాల క్రితం వచ్చిన పక్షవాతంతో మంచం పట్టిన నరసన్న ఆలనాపాలన భార్య లక్ష్మి చూస్తోంది. వీరు పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారు. వచ్చిన పింఛన్‌తో మందులు, ఇతర అవసరాలకు ఖర్చు పెట్టుకునేవారు. సదరం క్యాంప్‌లో వైకల్యం 85 పర్సెంటేజ్ ఇచ్చారు. అయితే ప్రస్తుతం 40 శాతం ఉందని, నీకు వచ్చే నెల నుంచి పింఛన్ రాదని నోటీసులు ఇవ్వటంతో ఆందోళన చెందుతున్నారు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలని దివ్యాంగుడు బోయ నరసన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

నేనూ అనర్హుడినా?



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడు గుడేకల్ గ్రామానికి బోయ బొజ్జయ్య. పుట్టుకతోనే దివ్యాంగుడు కావడంతో ఇప్పటి వరకు అవివాహితుడిగానే తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. రూ. 200లు నుంచి రూ. 6 వేల వరకు పింఛన్ తీసుకుంటూ వచ్చాడు. 12-11-2010లో సదరం క్యాంప్‌లో 90 శాతం వైకల్యం ఉందని ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదరం క్యాంప్‌లో డాక్టర్లు 40 శాతం కన్నా తక్కువ పర్సెంటేజ్ ఇవ్వటంతో పింఛన్ వచ్చే నెల నుంచి రాదని సచివాలయ ఉద్యోగులు నోటీస్ ఇవ్వడంతో కంగుతిన్నాడు. రెండు కాళ్లు లేకపోవడంతో చేతులతో పాకుతు వెళ్తున్నా అనర్హుడంటూ నోటీలు ఇవ్వటం గమనార్హం. నాకు పింఛన్ కట్ చేస్తే నేను ఎలా జీవనం సాగించాలని ప్రశ్నిస్తున్నాడు దివ్యాంగుడు బొజ్జయ్య.

అంధుల పాఠశాలలో చదువుతోంది



తండ్రితో కలిసి బ్రెయిలి లిపి పత్రాన్ని చూపుతున్న బాధితరాలు సుజాత

చిర్తనకల్లు గ్రామానికి చెందిన ఇసాక్ శోభరాణి దంపతుల కుమార్తె సుజాత పుట్టుకతోనే కళ్లు కనిపించవు. కళ్లు కనింపించక పోయినా కుమార్తె చదివించుకోవాలని ఆశపడి అంధుల పాఠశాలలో చదివిస్తున్నాడు. శ్రీ సత్యసాయి జిల్లా హిందుపురం -సేవామందిరం ప్రభుత్వ అంధ బాలబాలికల ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. గతంలో వైద్యులు 100 శాతం అంధత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చాడు. ప్రభుత్వం కనికరం చూడకుండా 40 శాతం తక్కువ ఉందంటూ నోటీసులు జారీ చేశారు. ఇదెక్కడి న్యాయం అంటూ తండ్రీ కుమార్తెలు ఆవేదన వ్యక్తం చేశారు.

పింఛన్ తొలగిస్తే చదువుమానుకోవాలి



చిర్తనకల్లు గ్రామానికి చెందిన రంగస్వామి, సరస్వతిల కుమార్తె రత్నమ్మ పుట్టుకతోనే ఒక కంటిలో పువ్వు ఏర్పడి కనపించదు. ఒక్క కంటితోనే డిగ్రీ వరకు చదువుకుని ఉద్యోగం సాధించాలని నంద్యాలలో బ్యాంక్ కోచింగ్ తీసుకుంటోంది. ఉన్న చూపు కూడా మందగిస్తోందని, తల్లిదండ్రులకు చదివించే స్తోమత లేదని, తనకు వచ్చే పింఛన్‌తో కోచింగ్ తీసుకుని చదువుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేస్తోంది. పర్సెంటేజ్ ఉన్నా నోటీసులు అందజేశారు. పింఛన్ లేకపోతే నా లక్ష్యం నెరవేర కుండ పోతుందని వాపోయింది. నాకు పింఛన్ పునరుద్ధరించి ఆదుకోవాలని కోరుతోంది.

కనికరం లేని కూటమి ప్రభుత్వం

- వైకల్య శాతం తక్కువగా ఉందని పింఛన్ల తొలగింపునకు కుట్ర
- కార్యాలయాల వద్ద దివ్యాంగుల నిరసన





మంత్రాలయంలో వినతి పత్రం అందజేస్తున్న వికలాంగుల సంఘం నాయకులు, ఎమ్మిగనూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ఎమ్మిగనూరురూరల్: కళ్ల ముందు వైకల్యం కనిపిస్తున్నా.. నడవలేని స్థితిలో ఉన్న, పక్షవాతం వచ్చినవారికి పర్సెంటేజీ పేరుతో పింఛన్లు కట్ చేయటం దారుణమని, ఇదేమి ప్రభుత్వం అంటూ దివ్యాంగులు మండిపడుతున్నారు. మా పింఛన్లు తొలగిస్తే మా జీవనాధారం ఏమి, మేము ఎలా బగతకాలని ప్రశ్నిస్తున్నారు. వచ్చే నెల నుంచి మీకు పింఛను రాదు అంటూ నోటీసు ఇవ్వటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని దివ్యాంగులు వాపోతున్నారు. మండలంలో 1318 దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి, అయితే వాటిలో 183 మంది దివ్యాంగులకు వచ్చే నెల నుంచి మీకు పింఛన్లు రావు అని నోటీలు ఇవ్వటంతో దివ్యాంగులు షాక్‌కు గురయ్యారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ఆందోళనకు దిగారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు సోమన్న, తాలుకా అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గోనెగండ్ల మండల అధ్యక్షులు సుంకన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనర్హుల ఏరివేత కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారికి పింఛన్లు తొలగించటం అన్యాయమన్నారు. సందరం క్యాంప్‌లో 80 నుంచి 90 శాతం ఉన్నవారికి 40 శాతం కంటే తక్కువ పర్సెంటేజ్ చూపి పింఛన్లు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ బంగారమ్మకు దివ్యాంగులు వినతి పత్రం అందచేశారు.

కోసిగి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక కనికరం లేకుండా అంధులను చూడకుండా పర్సెంటేజ్ లేదని పింఛన్‌కు అనర్హులుగా నోటీసులు అందజేయడంతో దివ్యాంగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గురువారం చిర్తనకల్లు గ్రామానికి చెందిన దివ్యాంగులు సుజాత, ఈరమ్మ, రత్నమ్మలు వారి నాన్నలతో కలిసి నోటీసులు చూపిస్తు ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రాలయం రూరల్ : పింఛన్ రద్దు చేస్తున్నామంటూ నోటీసులు జారీ చేసిన దివ్యాంగులకు పింఛన్ కొనసాగించాలని వికలాంగులు, వివిధ్న ప్రతిభవంతుల సంఘం ఆదోని డివిజన్ అధ్యక్షుడు జెట్టి వీరేష్, మంత్రాలయం అధ్యక్షుడు బీపీ పెద్దయ్య డిమాండ్ చేశారు. ఎంపీడీఓ నూర్జహాన్‌కు సంఘం నాయకులు, దివ్యాంగులు వినతి పత్రం అందజేశారు. మండలంలో దాదాపు 250 మందికి నోటీసులు జారీ చేశారన్నారు. వారికి పింఛన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. మేకల బంగారప్ప, దివ్యాంగులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సూచించారు. గురువారం రాత్రి ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో గణేష్ చతుర్థి ఉత్సవ కమిటీ మొదటి సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదోని, ఎమ్మిగనూరు డీఎస్పీలు హేమలత, భార్గవి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డివిజన్ స్థాయి అధికారులు, గణేష్ చతుర్థి ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ స్థాయి అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

వినాయక చవితి మండపాలకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలని డీఎస్పీ హేమలత అన్నారు. ప్రతి మండపం వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం ఉన్న చోట ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి మండపం వద్ద పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా డస్ట్‌బిన్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనులలో భూములు కోల్పోయిన రైతులు సహకరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కోరారు. గురువారం ఆయన కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనులు పరిశీలించారు. అక్కడే భూములు కోల్పోయిన రైతులతో సమావేశమయ్యారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనులలో 16 మంది రైతులకు చెందిన 4.99 ఎకరాలు అవసరమన్నారు. ఇందుకు ప్రభుత్వానికి నివేదిక పంపి త్వరలోనే రైతులకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కోసిగి తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసి వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో 14 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తిగా కాగా, మిగిలిన గ్రామాల్లో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ గోడౌన్ తనిఖీ చేసి యూరియా స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు పెండింగ్ ఉంచకుండా యూరియాను అందించేలా చూడాలని ఏఓ వరప్రసాద్‌ను ఆదేశించారు. ఆర్ఐ శ్రీరాములు, సర్వేయర్ శ్రీనివాసులు, ఐరన్‌గల్లు సర్పంచ్ రామాంజినేయులు పాల్గొన్నారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

నందవరం : గ్రామాల్లో చేపట్టిన కౌశల్ సర్వే, సీటీజన్ ఈ కేవైసీ, బయోమెట్రిక్ అప్డేషన్‌లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంపురం, నదికై రవాడి గ్రామాల్లోని సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటనరసమ్మ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే కోసిగిలో చోరీ



బీరువాలో నగలు పోయాయని చూపుతున్న బాధితులు

కోసిగి: కోసిగిలోని సిద్దప్ప పాళెం ఎస్సీ కాలనీలో తుప్పెద భీమయ్య, ఈరమ్మల ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకురైల్వే గ్యాంగ్ మేన్‌గా పనిచేస్తున్న భీమయ్య ఉదయం విధులకు వెళ్లాడు. భార్య ఈరమ్మ కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామంలో బంధవుల పెళ్లి ఉండడంతో ఇంటికి తాళం వేసి వెళ్లింది. ఆమె పెళ్లి నుంచి తిరిగి వచ్చే చూసేసరికి ఇంటికి బయట వేసిన తాళం వేసినట్టే ఉంది. అయితే దొంగలు ఇంటి పక్కనే మెట్లపై భాగంలో ఏర్పాటుకు చేసుకున్న జాలిని తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. బిరువా తలుపులు పగల కొట్టి, అందులోని 5 తులాల బంగారం(నక్లెస్, కమ్ములు, ఉంగరం), 70 తులాల వెండి కడియాలు, చైన్‌లు, రూ.10వేల నగదును అపహరించుకుని వెళ్లినట్లు బాధితులు వాపోయారు. ఈ మేరకు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం



మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: అర్హులైనప్పటికీ దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడం నిరుపేదల కడుపు కొట్టడమే అన్నారు. 14 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల పింఛన్లు రద్దు చేయడం శోచనీయమన్నారు. పుట్టుకతోనే వైకల్యం కలిగిన వారు, ప్రమాదాల్లో చేతులు, కాళ్లు కోల్పోయిన వారు, శాశ్వతంగా ఎటువంటి పనులు చేసుకోలేని వారికి జీవనాధారం దివ్యాంగుల పింఛనే అన్నారు. ఒక్క ఎమ్మిగనూరు నియోజకవర్గంలో దాదాపు వెయ్యికి పైగా దివ్యాంగుల పింఛన్లు నిలిపివేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులు పింఛన్ల తొలగింపుపై ఆందోళన చెంది రోడ్లపైకి వచ్చి, ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట నిరసనలు, ధర్నాలు చేపడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. పింఛన్లకు మేము అర్హులమని దివ్యాంగులమని వారు మొరపెట్టుకొంటున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించకపోతే ఆందోళనలు ఉధృతమవుతాయని హెచ్చరించారు.

డీఎస్సీ నియామక ప్రక్రియపై అనుమానాలు



నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించడంతో అభ్యర్థుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ చైర్మన్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా వుందన్నారు. పరీక్షల అనంతరం మెరిట్ లిస్ట్, కేటగిరి వారీగా కటాఫ్ మార్కులు ప్రకటించడం సర్వసాధరణమన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మెరిట్ లిస్ట్ ప్రకటించకపోవడం, కటాఫ్ వివరాలు దాచి పెట్టడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. అభ్యర్థులు సబ్జెక్ట్ వారీగా తాము ఎక్కడ నిలిచారన్న స్పష్టత లేక కౌన్సిలింగ్‌కు సిద్ధం కాలేకపోతున్నారని తెలిపారు. రోస్టర్, రిజర్వేషన్ల అమలుపై కూడా ప్రభుత్వం ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం పారదర్శకత సూత్రాలకు విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే జిల్లాల వారీగా మెరిట్ లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో ప్రకటించాలన్నారు.

కొరవడిన పారదర్శకత

ఆదోని సెంట్రల్: కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో చేపడుతున్న నియామక ప్రక్రియలో పారదర్శకత కొరవడిందని వైఎస్సార్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పురపాలక కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ అనంతరం మెరిటి లీస్ట్, కటాఫ్ మార్కులను ప్రకటించక పోవడంతో అభ్యర్థులలో తీవ్రమైన ఆందోళన నెలకొందన్నారు. రోస్టర్ రిజర్వేషన్లు అమలుపై ఎటువంటి అధికారిక సమాచారం ఇవ్వకపోవడం అనేది పారదర్శకతకు విరుద్ధమన్నారు.

అనుమానితుల ఇళ్లల్లో సోదాలు



సోదాల్లో పట్టుబడిన మారుణాయుధాలను చూపుతున్న ఆదోని డీఎస్పీ హేమలత, సీఐలు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని బోయగేరి, వాల్మీకినగర్, నిజాముద్దీన్‌కాలనీ కాలనీల్లోని అనుమానితుల ఇళ్లల్లో ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య, పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో గొడ్డలి, కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లదేన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

ఆదోని రూరల్/గోనెగండ్ల /కోసిగి/ మంత్రాలయం రూరల్ /ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేయండి

కౌతాళం: మండలానికి అవసరమైన యూరియాను సప్లై చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆదోని వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జి. హోసళ్లికి రోడ్డు వేయండి

కౌతాళం: బదినేహాల్ నుంచి జి.హోసళ్లికి రోడ్డును వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కన్వీనర్ ఈరన్న ఆధ్వర్యంలో రోడ్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బదినేహాల్ నుంచి ఆదోనికి ప్రయాణం చేయలంటే 20 కిలో మీటర్ల దూరం గంటన్నర సమయం పడుతుందన్నారు. బదినేహాల్- కౌతాళం రోడ్డు కూడా ఇలాగే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉలిగయ్య, శంకర్, మాబాషా, బందినవాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్ పరిధిలో ఐరన్‌గల్-మంత్రాలయం ఆర్ఎస్‌ల మధ్య 530/13-15 అప్‌లైన్ ట్రాక్ వద్ద గురువారం కొట్టం ప్రసాద్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ కడప జిల్లా, రాజంపేట మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన లెట్ సుబ్బరామయ్య కుమారుడిగా అతని వద్ద దొరికిన అధార్ కార్డును బట్టి గుర్తించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ట్రెన్‌లో క్లీనింగ్ బాయిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ట్రైన్ నంబర్ 12794 నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడని, తీవ్రమైన రక్త గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వ్యక్తిపై దాడి

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన పింజరి అలిసాబ్‌పై అదే గ్రామానికి చెందిన బోయ తాయన్న కుమారులు ఈరన్న, ఎల్లప్ప, వెంకటేష్ అనే ముగ్గురు వ్యక్తులు రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు బోయ తాయన్న పొలానికి పింజరి అలిసాబ్ పొలం మీదుగా నీటి పైపులు వెళ్లాయి. అయితే అలిసాబ్ తన పొలంలో ఎద్దులతో గుంటుక పాస్తుండగా పైపులైన్ పగలిపోయింది. అయితే ఉద్దేశ పూర్వకంగా మా పైప్‌లైన్ పగలగొట్టాడని తాయన్న కుమారులు మూకుమ్మడిగా అలిసాబ్‌పై రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆయన తలకు కంటి భాగాన తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఆయనకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నిబంధనలు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త బార్ పాలసీ ప్రకారం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో లైసెన్సుదారులు, ఆశావాహులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న బార్ టెండర్లకు అఖరు తేదీ అని, 28న కర్నూలులో లాటరీ ద్వారా ఎంపిక చేస్తారని చెప్పారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న మూడు బార్లకు ఈ నెలాఖరకు గడవు పూర్తి అవుతుందని తెలిపారు. కొత్తగా ఈ సారి రెండు బార్లు వచ్చాయని చెప్పారు. పోటీలో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ ఇస్మాయిల్, లైసెన్సుదారులు, తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పాటుపడాలి

పెద్దకడబూరు : ప్రతి విద్యార్థి దేశం కోసం పాటుపడాలని ఏ.వెంకటరెడ్డి అన్నారు. ఆయన తాత స్వాతంత్ర్య సమరయోధులు ఏ.వెంకటరెడ్డి 115వ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఉమా రాజేశ్వరి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 2024 - 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కే.కృష్ణకు రూ. 5016, నాగరాజుకు రూ. 3016, శివాజీరెడ్డికి రూ. 2016 నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయుర్వేద డాక్టర్ రాజేశ్వరి విద్యార్థులకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వివరించారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు వేరుశనగ పంట సాగులో సమగ్ర చర్యలు చేపట్టాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో ఎం. శివశంర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట గ్రామంలోని వేరుశనగ పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇటీవల ఎడతేరిపి లేకుండా కురిసిన వర్షాలకు వేరుశనగ పంటలో ఇనుపధాతు లోపించినట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు అన్నభేది లేదా ఫెర్రస్ సల్ఫేట్ ఐదు గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని 10 రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఏఈవోలు నరసింహులు, రసూల్, రైతులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఆదోని రూరల్: ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో నీటి కుంటలో పడి మృతిచెందిన ఆరుగురు విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీయూ ఎస్ఐ జాతీయ కార్యదర్శి పి.కోదండ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, గంగపుత్ర సంఘం నాయకులు ప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం వారు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నీటికుంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రమాదకరంగా మారిన నీటికుంటను పూడ్చి వేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

ఘనంగా ధ్యాన్ చంద్ జయంతి



ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి, మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదోని జోన్ పరిధిలోని బాలురు, బాలికలకు జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పురపాలక మైదానంలో జరిగే ఈ క్రీడా పోటీల్లో బాలుర జట్లు 17, బాలికల జట్లు 10 పాల్గొంటున్నాయని వారు తెలిపారు. ఇందులో విజేతలుగా నిలిచిన జట్లకు ఈ నెల 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పురపాలక, నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లికార్జున, ఫయాజుద్దీన్, విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయులు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం స్వీకరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కోదండరామిరెడ్డి

నందవరం: మండల కేంద్రం నందవరం పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ కేబీ. కోందడరామిరెడ్డి, కానిస్టేబుల్ నరేంద్ర గురువారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మహిళ మిస్సింగ్ కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ కోదండ రామిరెడ్డి, కానిస్టేబుల్ నరేంద్రలు వీరి ఇద్దరు మహిళ మధరైలో ఉందని తెలుసుకుని అక్కడికి వెళ్లి తీసుకువచ్చారు. వారంలో రోజుల్లో మహిళ మిస్సింగ్ కేసు ఛేదించి, మహిళలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అందుకుగానూ కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 30 మంది మందుబాబులకు గురువారం న్యాయస్థానం రూ.3 లక్షలు జరిమానా విధించింది. ఆదోని న్యాయస్థానం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత రెండు, మూడు నెలల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 30 మందికి జడ్జి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.3 లక్షలు జరిమాన వేశారని టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలో నాక్ ఏ గ్రేడ్ సాధించిన ఏకై న డిగ్రీ కళాశాల స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అని ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్‌బాషా అన్నారు. కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించడంతో గురువారం విద్యార్థులతో కలిసి అధ్యాపకులు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు తమ దరఖాస్తులను కళాశాలలోనే పూర్తి చేసి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో బీఏ హానర్స్ హిస్టరీ, బీఏ ఎకనామిక్స్, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ ఫిజిక్స్ కోర్సులున్నాయన్నారు. అహ్లాదకరమైన వాతావరణంతో కూడిన కళాశాలలో అన్ని వసతులు న్నాయని తెలిపారు.